క్లుప్తంగా

ముగ్గురు అదృశ్యం

● తల్లీ కూతురు, వృద్ధుడు

జడ్చర్ల: శాంతినగర్‌కు చెందిన గాయత్రి(22), ఏడాది కూతురు రిహాన్సికలు ఈ నెల 15నుంచి కనిపించకుండా పోయారని సీఐ కమలాకర్ తెలిపారు. బంధువుల దగ్గర చుట్టుపక్కల ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేక పోవడంతో భర్త అన్వేష్ కుమార్ గురువారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● మండలంలోని ఉదండాపూర్ గ్రామానికి చెందిన రాంచంద్రయ్య(62) కనిపించకుండా పోయాడని సీఐ కమలాకర్ తెలిపారు. ఈనెల 17న వరంగల్ జిల్లా పరకాల వద్ద గొర్రెలు మేపడానికి జీతం కుదిరేందుకు వెళ్లాడని, అయితే ఇప్పటి వరకు అక్కడకు చేరుకోలేదని, ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోందని కుమారుడు శివ ఫిర్యాదు చేశాడు. దీంతో అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదంపై కేసు నమోదు

జడ్చర్ల: మండలంలోని మల్లెబోయిన్‌పల్లి స్టేజీ వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వినోద్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. భూత్పూర్ వైపు నుంచి జడ్చర్లకు స్కూటీపై వెళ్తుండగా, వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రమాదవశాత్తు తలకు గాయమై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్టిజన్ శ్రీహరిని గురువారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వేరే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాములుగౌడ్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు. కోడూర్ మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌గౌడ్ ఆయన వెంట ఉన్నారు.

కల్తీ గుడ్లు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని క్లబ్‌రోడ్డులోని కిరాణ దుకాణంలో మూడు గుడ్లు తీసుకురాగా, అందులో ఎల్లోకి బదులుగా గులాబీ రంగు పదార్థం వచ్చిందని కొనుగోలుదారుడు గాంధీనగర్ ట్రస్టులో ఉండే బాలకృష్ణ పేర్కొన్నారు. పెంపుడు కుక్క కోసం గుడ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల క్రితం ఓ దుకాణంలో పాలు తీసుకురాగా కుక్క తాగి వాంతులు చేసుకుందని, పశువుల దవాఖానకు వెళ్లి చూయించినట్లు తెలిపారు. ఇలా పాలు, గుడ్లు కల్తీ అవుతుండటం విచారకరమని, అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వల్లే ఇలాంటి కల్తీ పెరిగాయని ఆయన ఆరోపించారు. కల్తీ విషయాలపై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

రాజాపూర్: మండలంలోని ముదిరెడ్డిపల్లి శివారులో గురువారం కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారంతో కానిస్టేబుల్ కృష్ణయ్య, ఖాజాకలీమొద్దీన్‌లు దాడి చేశారు. పెద్ద బండ వద్ద పేకాట ఆడుతుండటంతో దాడి చేసి పేకాట ముక్కలతో పాటు రూ.2100 స్వాధీనం చేసుకున్నారు. ముదిరెడ్డిపల్లికి చెందిన సుకుమార్, కావలి కృష్ణయ్య, టోకియా, బోయ మహేష్, ఆంజనేయులు, తిరుపతయ్య, ఉండెకోటి లక్ష్మయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపారు.

సొంతింటి కల నెరవేరే వేళ



నవాబుపేట: చాలా ఏళ్లుగా సొంతింటి కోసం వేచి చూసి ఎట్టకేలకు తాజాగా ప్రభుత్వం రూ.5 లక్షలతో ఇంటిని మంజూరు చేయించి నిర్మిస్తుండటంతో కల నెరవేరుతోందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి శశికళరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని లింగంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం చేస్తున్న చోట వారికి ప్రొసీడింగ్‌లు అందించి అభినందించారు. కార్యక్రమంలో జడ్చర్ల నియోజకవర్గం కాంగ్రెస్ అధ్యక్షురాలు డాక్టర్ మీనాక్షి, సుధాకర్‌రెడ్డి, రాములు, సుజాత, నర్సింహులు, శాంతయ్య తదితరులు ఉన్నారు.

ఆందోళనలో ఓపీఎస్‌లు



కోడూర్ పంచాయతీ కార్యాలయం

- జీపీల్లో ఔట్ సోర్సింగ్ కార్యదర్శుల వెట్టిచాకిరీ
- జేపీఎస్, పీఎస్‌లతో సమానంగా విధులు
- పనికి తగ్గ వేతనాలు కరువు
- రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీ పరిపాలనలో తమ వంతు పాత్ర పోషిస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు ఆందోళనలో ఉన్నారు. తమ ఉద్యోగాలు ఉంటాయే.. ఊడుతాయో అనే భయాందోళనలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తారనే ప్రచారం చక్కర్లు కొడుతోంది. దీంతో వివిధ ఓపీఎస్‌లలో ఆందోళన మొదలైంది. ప్రభుత్వ నిర్దేశానుసారం గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ (ఓపీఎస్) పంచాయతీ కార్యదర్శులకు భరోసా కరువైందని వాపోతున్నారు. 2017లో ప్రభుత్వం విడుదల చేసి న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల భర్తీ నోటిఫికేషన్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు పరీక్ష రాసి మెరిట్, రోస్టర్ పాయింట్ల ద్వారా ఎంపికయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో జేపీఎస్‌లతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. వారి కి రూ.12,600 నుంచి రూ.15000 వరకు వేతనం అందిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర వేతనం మూడు నెలలకోసారి ఇస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో 33మంది ఓపీఎస్‌లు..

మహబూబ్‌నగర్ జిల్లాలో 33 మంది ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులున్నారు. ఖాళీగా ఉన్న పంచాయతీ సెక్రటరీ పోస్టులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో ప్రభుత్వం భర్తీ చేసింది. ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్యదర్శులను ప్రభుత్వం గతంలో కొందరిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా కన్వర్షన్ చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో నోటిపై చేయబడి క్లియర్ వేకెన్సీగా చూపిస్తున్న స్థానాల్లో రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసిన ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా కన్వర్షన్ చేస్తూ రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

వేతనాల్లో భారీ వ్యత్యాసం..

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం రూ.28,719 వేతనం అందిస్తుండగా ఔట్ సోర్సింగ్ వారికి కేవలం రూ.12,600 అందిస్తున్నారు. ఈ ఓపీఎస్ జీతాలు కూడా జిల్లా కో తీరుగా ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో అత్యధికంగా రూ.15 వేలు చెల్లిస్తుండగా, మరికొన్ని జిల్లాలో రూ.10,600, రూ.12,500 చొప్పున ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు చెల్లిస్తున్నాయి. అవి రెండు, మూడు నెలలకోసారి ఇస్తున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిన్నర నుంచి నిధులు లేవు..

ఏడాదిన్నరగా ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 15వ ఫైనాన్స్ నిధులతో పంచాయతీలో కార్యక్రమాలు నిర్వహించారు. 2024 జనవరి 31తో సర్పంచుల పదవీకాలం ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన రావడంతో పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి దారుణనంగా మారింది. కేంద్రం 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు సైతం నిలిచి పోయాయి. కనీసం కరెంట్ బిల్లులు, బోరు మరమ్మతులు, ట్రాక్టర్లకు డీజిల్ కొనలేని పరిస్థితి నెలకొంది. స్పెషల్ ఆఫీసర్లు చేతులెత్తేయడంతో, అప్పులు చేసి మరీ కనీస అవసరాలు తీర్చేందుకు పంచాయతీ కార్యదర్శులు నానా తంటాలు పడుతున్నారు.

తలలు పట్టుకుంటున్న వైనం..

15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ నిధులు, పన్ను వసూలు పంచాయతీలకు ముఖ్యమైన ఆర్థిక వనరులు. చాలా కాలంగా ఈ నిధులు సైతం నిలిచిపోయాయి. ఖర్చులు పెరగడంతో మిగులు ఏమీ ఉండడం లేదు. ఈ క్రమంలో కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక గతంలో ఉద్యోగాలకు రాజీనామా, ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలున్నాయి. తాజా మాజీ సర్పంచులు తమ హయాంలో పెండింగులో ఉన్న డ్రైయినేజీ, అంతర్గత సీసీ రోడ్లకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలంటూ కార్యదర్శులపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



దాచక్‌పల్లిలో మహేశా పిరమిడ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దాచక్‌పల్లిలో ఉన్న మహేశా పిరమిడ్‌ను ఆయన సందర్శించారు. పిరమిడ్‌లో ధ్యానం చేసి మాస్టర్లతో ఆధ్యాత్మికత అంశాలపై చర్చించారు. నిత్యాన్నదానం కోసం వంటశాల నిర్మిస్తున్నామని ఎమ్మెల్యేకు వివరించగా, ఆయన స్పందిస్తూ రూ.5 లక్షలు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ హితం చేపట్టే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాల న్నారు. ధ్యానంతో ఒత్తిళ్లను జయించవచ్చన్నారు. రాజకీయ నాయకులకు ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎస్పీ వెంకటేష్, పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో రీడింగ్ సెంటర్ ప్రారంభం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రయాణీకుల కోసం ఏర్పాటు చేసిన పఠన మందిరం(రీడింగ్ సెంటర్)ను ఎమ్మెల్యే యె న్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి ప్రతి రోజు దూర ప్రాంతాలకు, వివిధ పనుల కోసం ప్రయాణం కొనసాగిస్తారని, బస్‌ల కోసం నిరీక్షించే సమయంలో పుస్తక పఠనం చేస్తే మంచి కాలక్షేపంతోపాటు విజ్ఞానం దొరుకుతుందన్నారు. కేవలం కథల పుస్తకాలు మాత్రమే కాకుండా కొన్ని కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు సైతం అందుబటులో ఉంచుతామన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 25 బస్ స్టేషన్‌లలో పఠన మందిరాలు ఏర్పాటు చేయగా మహబూబ్‌నగర్‌లో మొదటి పఠన మందిరాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం లక్ష్మీధర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, అజ్మత్‌అలీ, అవేజ్ అహ్మద్, రమేష్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, హన్మంతు, ఖాజపాష, అబ్దుల్ హక్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను కొనసాగిద్దాం



కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్లు



మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

సాక్షి, నెట్‌వర్క్: దళిత సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. భాగ్యరెడ్డి వర్మ 137 జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, కలెక్టరేట్ ఏఓ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

● భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను జిల్లా మాల ఉద్యోగుల సంఘం, జ్ఞాన నీలి మెరుపు బహు జన మహాసేయుల శోభయాత్ర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూమార్ల నిరంజన్, జిల్లా అధ్యక్షుడు బండి రమాకాంత్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై భీమ్ చౌరస్తాలో శోభయాత్ర కమిటీ జిల్లా అధ్యక్షుడు పాతూరు రమేష్, జిల్లా కోర్డినేటర్ సింగిరెడ్డి పరమేశ్వర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగడ్డ యాదయ్య, ఉద్యోగ సంఘం నాయకులు పవన్, అశోక్, కృష్ణ, శోభయాత్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం భాగ్యరెడ్డి వర్మ ఎంతో శ్రమించారని జిల్లా ఎస్పీ డి.జానకి అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, ఎస్‌బీ సీఐ వెంకటేష్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్ పాల్గొన్నారు.

● మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో భాగ్యరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈ సందీప్ వరల్డ్, ఆర్ఐ టి.నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

● నవాబుపేట ఎంపీడీఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.భాగ్యరెడ్డి చేసిన సేవలు మరవలేనివని, ఆయన అందరికి ఆదర్శమని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఈఓపీఆర్డీ భద్రునాయక్ అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్యసిబ్బంది రాఘువేందర్, శ్రీనివాస్, మాధవి, నిర్మల ఉన్నారు.

● దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, డీటీ దీపిక, ఆర్ఐ శరత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ రథోత్సవం



గాధిర్యాల్ వీరహనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఐక్యతకు పునాదులని హిందూ బంధువులను ఒక్కటిగా చేసే మంచి కార్యక్రమమని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గాధిర్యాల్ హనుమాన్ మందిరంలో దర్శనం చేసుకున్నారు. ఇలాంటి పండుగలతో ఆధ్యాత్మికత ఎంతో బలపడుతుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. రథోత్సవంలో భక్తులతోపాటు ఆయన తేరులాగారు. గాధిర్యాల్‌లో వీరహనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 4గంటలకు రథోత్సవం (తేరు) నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ పల్లకీసేవ, బొడ్రాయికి బోనాలు, పోతరాజుల విన్యాసా లు ఆకట్టుకున్నాయి.

హనుమాన్‌చాలీసా పారాయణం

జడ్చర్ల టౌన్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని వాసవికన్యకా పరమేశ్వరి ఆలయంలో హనుమాన్‌చాలీసా పారాయ ణం చేశారు.

ఘనంగా హనుమాన్ జయంతి

దేవరకద్ర: మండలంలో ప్రసిద్ధి చెందిన చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని గోపన్‌పల్లిలో ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామి వారిని పంచామృతాభిషేకం నిర్వహించారు.

● భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్‌లో ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు.

పర్సెంటేజీల కోసం ప్రభుత్వ భూములు కేటాయించొద్దు

భూత్పూర్: పర్సెంటేజీల కోసం ప్రభుత్వ భూములను కేటాయిస్తే పోరాటం ఉధృతం చేస్తామని బీజేపీ దేవరకద్ర నియోజవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. గురువారం మున్సిపాలిటీలోని 1వ వార్డు నల్లగుట్ట తండా వద్ద ఉన్న సర్వే నంబరు 527లో 38 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించడంతో తండా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో పాటు కొండ ప్రశాంత్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.



టీటీడీ కల్యాణ మండపంలో విశేష పూజలు



స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో హనుమన్ జయంతి సందర్భంగా గురువారం ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా భజన బృందం, శ్రీసీతారామ భజన మండలి, స్థానిక భజన మండలితో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో కనిపెట్ట భజన మండలి అధ్యక్షులు రంగారెడ్డి, సంజీవాచారి, శ్రీవారి సేవకులు ఎ.కేశవులు, సురేష్‌చంద్ర దూత్, హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ తనిఖీ చేశారు. రైతులకు నాణ్యత గల విత్తనాలు విక్రయించాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలకు సంబంధించి బిల్లు రశీదులు ఇవ్వాలన్నారు. ప్రతి షాపు ముందు స్టాక్ బోర్డు పెట్టాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని కోరారు. కాలంతీరిన పురుగు మందులు, విత్తనాలు విక్రయించరాదన్నారు. వ్యవసాయ అధికారులు మండల కేంద్రంలోని నాలుగు ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు.

స్టేడియాన్ని సందర్శించిన డీవైఎస్ఓ

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మినీస్టేడియాన్ని డీవైఎస్ఓ శ్రీనివాసులు గురువారం సందర్శించారు. స్టేడియంలోని సమస్యలను వార్డు కౌన్సిలర్ సతీష్, క్రీడాకారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్టేడియానికి వచ్చే వారికి తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి మిషన్ భగీరథ కనెక్షన్ ఇచ్చేలా చూస్తామన్నారు. బాత్‌రూం సమస్య లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తిరంగా ర్యాలీ



చిన్నచింతకుంట: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా మండల కేంద్రంలో బాల గంగాధర్ తిలక్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, మహిళలు, విద్యార్థులు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణా లు కోల్పోయిన వీర జవాన్ మురళి నాయక్‌కు నివాళులర్పించారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు నంబిరాజు, కుర్వరమేష్, మోహన్‌గౌడ్, వజీర్ బాబు, మహిమూద్, ఎస్ వెంకటేష్, గంజి బాల్‌రాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ మంజూరు



మెట్టుగడ్డ: మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్‌ను ముడా కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రెస్ క్లబ్ ఆవరణలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో బోర్ వేశారని, అక్కడ ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ముడా చైర్మన్‌ను కోరారు. అడిగిన వెంటనే స్పందించిన ముడా చైర్మన్ ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రెస్‌క్లబ్‌కు వెళ్లి స్థల పరిశీలన చేయాలని, అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. కాంట్రాక్టర్ ప్రెస్‌క్లబ్‌ను సందర్శించి స్థలం పరిశీలించారు. ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుతో పాటు ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని ముడా చైర్మన్ హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గ సభ్యులను ముడా చైర్మన్ సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నరేంద్రచారి, ప్రధాన కార్యదర్శి నరేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు చింతకాయల వెంకటేష్, ధరణీకాంత్, పాత్రికేయులు పాల్గొన్నారు.

సహకరించండి.. అభివృద్ధి చేస్తాం



మహమ్మదాబాద్‌లో బస్‌షెల్టర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, సహకారిస్తే అభివృద్ధి చేసి చేయిస్తానని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని చిన్నాయపల్లి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మహమ్మదాబాద్ రోడ్డుపై బస్‌షెల్టర్ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. అవసరమున్నచోట సీసీరోడ్ల నిర్మాణాలు, అండర్ డ్రెయినేజీ పనులు ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేయిస్తున్నామన్నారు. మన ప్రభుత్వం ఇచ్చే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, మాజీ ఎంపీపీ శాంతిబాయి, డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ముకుందం, భీమయ్య, జునేద్, శ్రీను, భరత్, నాగయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయడం లేదని నిరసన



అప్పంపల్లి కొనుగోలు కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చిన్నచింతకుంట: కొకుంట్ల మండలం అప్పంపల్లిలో వరిధాన్యం కొనుగోలు చేయడం లేదని గ్రామ రైతులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు వెంకట్ రాజారెడ్డి, గోవిందు మాట్లాడుతూ.. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి నెలరోజులు కావొస్తున్నా కొనుగోలు చేయడం లేదన్నారు. సన్నాలలో కేఎస్ఎం రకం విత్తనాలు ప్రభుత్వమే విక్రయించగా.. పంట పండించి కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే జాప్యం వహిస్తున్నట్లు తెలిపారు. 40 కిలోల బస్తాకు 2కిలోల తరుగు ఇస్తే కొంటామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కొనుగోలు చేసిన ధాన్యాన్ని కూడా మిల్లులకు తరలించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు శేఖర్, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ



నవాబుపేటలో ఆగ్రోస్‌లో సబ్సిడీ విత్తనాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

నవాబుపేట: రైతులకు చాలా ఏళ్ల అనంతరం జీలుగ విత్తనాలు అందించే కార్యక్రమం ప్రజాప్రభుత్వం చేపట్టిందని మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆగ్రో సెంటర్‌లో సబ్సిడీపై రైతులకు అందించే జీలుగ విత్తనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వకుండా చాలాభారం వేసిందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. తాజాగా ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు అందించే కార్యక్రమం చేపట్టిందన్నారు. మండల కేంద్రంలో ఆగ్రోస్ ద్వారా జీలుగ విత్తనాలు రూ.4,639 ధర ఉన్న 30 కేజీల జీలుగ విత్తనాలు, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రూ.2,318 లకు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. వంద బస్తాల జీలుగ, మరో వంద బస్తాల జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్, మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరాంనాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ వెంకటేష్, ఆగ్రో ఇన్‌చార్జి రాఘవేంద్ర, సత్యం, నర్సింహ, తదితరులు ఉన్నారు.

ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి



మాట్లాడుతున్న బి.శ్రీనివాసులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండి 12 ఏళ్లు గడుస్తోందని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగ నియామకాలు చేపట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానిగా నరేంద్రమోదీ అధికారం చేపట్టి 2400 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. పహల్గాంలో జరిగిన కాల్పులకు 26 మంది అమాయక ప్రజలు చనిపోతే దాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఆపరేషన్ ఖగార్ పేరుతో నల్లగుట్ట చుట్టు ఉన్న అమాయక ప్రజలను నక్సల్స్ అంటూ ఎన్‌కౌంటర్ చేయిస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని కేంద్ర బీజేపీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. అనంతరం కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కొండపల్లి రాము, కోకన్వీనర్‌గా మహేశ్, సభ్యులుగా రమేశ్, రాకేశ్, నరహరి, ప్రవీణ్, గణేశ్, బస్వరాజ్, మధులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, నాయకులు నారాయణరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన పీజీటీ ట్రస్ట్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని పి.బాలకృష్ణయ్య గౌడ్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.రాంరెడ్డి అన్నారు. గురువారం దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సభకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యాలయాలు పోటీ ప్రపంచంలో విద్యార్థులను పుస్తకాల పురుగులుగా తయారు చేస్తున్నాయన్నారు. కేవలం చదువే కాకుండా ఆటపాటల్లో కూడా విద్యార్థులను తీర్చిదిద్దే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం సమ్మర్ క్యాంపులో పాల్గొన్న 40 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కిల్లె గోపాల్, ఎ.రాములు, కురుమూర్తి, మాణిక్యంరాజు, ఖమర్ అలీ, సమ్మర్ క్యాంపు నిర్వాహకులు మోహన్, చంద్రకాంత్, వరద గాలన్న పాల్గొన్నారు.